


# కరపత్రం

SINCE 2014

గురువారం జనవరి 16 2025 | సంపుటి :0 | సంచిక : 95 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

# సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ టూర్..

## మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం?



హైదరాబాద్:
ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ నేతలు కూడా ఢిల్లీ వెళ్లారు. బుధవారం ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం అనంతరం సీఎం, పీసీసీ అధ్యక్షుడు ఏఐసీసీ నేతలను కలిసే అవకాశముంది. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై చర్చించే అవకాశం ఉన్నట్టు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.
సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బృందం 16న ఢిల్లీ నుంచి సింగపూర్ వెళ్తారు. ఈనెల 19 వరకు సింగపూర్‌లో పర్యటించి.. స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యంపై ఒప్పందాలు.. పారిశ్రామిక పెట్టుబడులపై సీఎం బృందం చర్చించనుంది. ఈనెల 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు.

### నకిలీ టికెట్లతో తిరుమల శ్రీవారి దర్శనం.. పోలీసుల అదుపులో ఐదుగురు



2లో

- నకిలీ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్లు) టికెట్లతో భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

### ప్రయాణ టికెట్లు, గిఫ్టులు, పండుగ ఆఫర్లు.. సైబర్ మోసాల పట్ల జరభద్రం



2లో

- సంక్రాంతి పండుగ వేళ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖాగోయల్ సూచించారు.

### తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ సుజయ్‌పాల్


తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్ నియమితులయ్యారు.



2లో

### నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్..

## జాతికి అంకితం చేసిన మోదీ



2లో

- అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను ప్రధాని మోదీ జాతికి అంకితం చేశారు.

ముంబయి: భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరై.. యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకుసాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా నిలిచింది.
ఈసందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా.. రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే.

### మనోజ్‌ను అడ్డుకున్న పోలీసులు.. మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద మరోసారి ఉద్రిక్తత



- తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం సాయంత్రం మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది.

2లో

### ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్.. తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం

హైదరాబాద్:
ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు.



2లో

## సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు..

# పిటిషన్ కొట్టివేత



- మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లె ధర్మాసనం విచారణ జరిపింది.
రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరఫు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని

2లో

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలి



2లో

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు.
- వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.
- రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని వీరంతా కూలీ పనికి వెళ్లే నిరుపేదలు అని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు.
- రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు.

సిద్దిపేట : గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్ట కరమన్నారు. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలీ కాదు అని అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు ఉంటుందనే నిబంధన కూడా సరైంది కాదన్నారు. అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది.

# సంపాదకీయం

## కలల దేశంగా అమెరికా ఎప్పుడైనా ఉందా?

జాతీయవాదం... దాదాపు 200 ఏళ్లకు పైగా ప్రజలను ఉర్రూతలూగిస్తోంది. అన్ని సందర్భాల్లోనూ దీని ప్రభావం స్పష్టంగా కనపడకపోవచ్చు. సాధారణ ప్రజలు చాలాసార్లు జాతీయవాద ప్రేరణతో వ్యవహరించి ఉండకపోవచ్చు. కానీ కీలక సందర్భాల్లో విపరీతంగా ప్రభావితం చేసిన భావజాలాల్లో జాతీయవాదమే ప్రధానమైంది. జాతీయవాదం కోసం సర్వంధారపోసినవారు అన్ని దేశాల్లోనూ కనపడతారు. ఇదంతా ఒకవైపు కథే! మరోవైపు నుంచి చూస్తే విపరీత జాతీయవాదం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. అనేక యుద్ధాలకు, దారుణాలకు, వైషమ్యాలకు, విద్వేష ఆలోచనలకు కారణమై కోట్ల మంది జీవితాలను విచ్ఛిన్నం చేసిందీ జాతీయవాదమే! యుద్ధోన్మాదాలను రగిలించిన నాయకులందరూ జాతీయవాదాన్ని స్మరిస్తూనే రక్తపుటేరులను పారించారు. మితిమీరిన జాతీయవాదంతో ఏ దేశంలోనైనా నలిగిపోయేది మైనారిటీలే. చరిత్రను తవ్వితీస్తే కనపడేది ఈ చేదు నిజమే. దేశంలోని మెజారిటీ ప్రజలను... మతపరంగానో, భాషపరంగానో, జాతిపరంగానో (రేస్), ప్రాంతంపరంగానో ప్రధాన సమూహంగా గుర్తించి వారందరికీ ఒకే తరహా ఉమ్మడి ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేయటమే అతి జాతీయవాదంలో విశేషంగా ఉంటుంది. ప్రధాన సమూహ ప్రజల మధ్య తేడాలనూ, అసమానతలనూ గుర్తించకుండా కృత్రిమ జాతి ఆధిక్య భావాల చుట్టూ ప్రచారాన్ని కేంద్రీకరించి ఉద్రేకపరచటమే జాతీయవాదాల్లో తరచూ కనపడుతుంది. దేశం గొప్పగా భావించే సాంస్కృతిక వారసత్వాన్ని మైనారిటీలు అంగీకరించటం లేదనీ మనం తరచూ వింటూంటాం. సాంస్కృతిక ప్రత్యేకతలను వదులుకోనివారిని సందేహదృష్టితో చూడటం సంకుచిత జాతీయవాదంలో ప్రధానంగా కనపడుతుంది.

ప్రజాస్వామ్యానికి అగ్రదేశంగా మనందరమూ భావిస్తున్న అమెరికాలోనూ ఆది నుంచి ఇదే ధోరణి కనపడుతుంది. హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడే వెల్లడవుతోంది. కుల, తెగ మనస్తత్వాల కంటే జాతీయవాదం విశాలమైనదే కావచ్చు. కానీ జాతి, వర్ణ ఆధిక్యంపై జాతీయవాదం ఆధారపడిన చోట అమెరికా అయినా మరో చోటైనా జరిగే దురాగతాలు ఇంచుమించుగా ఒకేరకంగా ఉంటాయి. జాతీయవాదం పేరుతో సంకుచిత్వం పెరిగే కొద్దీ మైనారిటీలకు క్షోభ ఎక్కువవుతుంది. సందర్భాన్ని బట్టి ఈ క్షోభ రూపం ఆధారపడి ఉంటుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. 2022- 23లో 2,68,923 మంది భారతీయ విద్యార్థులు అమెరికాకు వెళ్లారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వారిని అక్కున చేర్చుకుని నివాసయోగ్యాన్ని కలిగించే దేశంగా అమెరికా గురించి ఘనంగా చెప్పుకోవటం అందరమూ వినే ఉంటాం. అమెరికాను వలసదారుల దేశంగా (ఎ నేషన్ ఆఫ్ ఇమ్మిగ్రంట్స్) వర్ణించి బాగా ప్రాచుర్యం కల్పించటంలో ఒకనాడు ఆ దేశాధ్యక్షుడిగా వ్యవహరించిన జాన్.ఎఫ్.కెన్నడి పాత్ర చాలా ఉంది. 'వలసదారుల దేశం' పేరుతో 1958లో కెన్నడి ఒక వ్యాసం రాశారు. దాన్నే తర్వాత పుస్తకంగానూ ప్రచురించారు. 1961లో కెన్నడి అధ్యక్షుడిగా ఎన్నికకావటానికి ఆ పుస్తకం చాలా తోడ్పడింది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పినా అది చాలా సందర్భాల్లో అమలుకాని ఆదర్శంగానే ఉండిపోయింది. అనేక దేశాల నుంచి వచ్చిన వలసదారుల అనుభవాలనూ, చరిత్రలనూ స్పృశిస్తూ జాక్లిన్ బాక్‌హౌస్.. 'ఎ న్యూ హిస్టరీ ఆఫ్ ఇమ్మిగ్రేషన్' పేరుతో రాసిన పుస్తకంలో ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. అమెరికా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న తొలినాళ్లలో అంటే 1790లో తీసుకొచ్చిన 'నేచరలైజేషన్ యాక్ట్'లోనే వలసలకు కఠిన పరిమితులు విధించారు. పశ్చిమ యూరపు నుంచి వచ్చిన వారికే పౌరసత్వాన్ని ఇచ్చే వీలు కల్పించారు. అందుకే 1840-90 మధ్య వలసదారుల్లో 90 శాతం మంది యూరపు నుంచే వచ్చారు. 1919 వరకూ కూడా ఈ పరిస్థితి అసలు మారలేదు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో వలసలు దాదాపుగా ఆగిపోయాయి. అమెరికాకు ఒకవైపున అట్లాంటిక్, మరోవైపున పసిఫిక్ మహాసముద్రాలు ఉన్నాయి. వీటి మధ్య భూభాగాలను కలుపుతూ రైల్వేలైన్లు వేయటం చాలా సంక్లిష్టమైన పని. అరణ్యాలు, ఉధృతంగా ప్రవహించే నదులు, మహాపర్వతాలతో కూడిన ప్రాంతాల్లో పనిచేయటానికి స్థానిక అమెరికన్లు ముందుకురాలేదు.

## సుప్రీంకోర్టులో కేటీఆర్‌కు చుక్కెదురు..

# పిటిషన్ కొట్టివేత

మొదటిపేజీ తరువాయి

అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరఫు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

**కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు..!**

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఈ నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం మార్చి రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఇస్తున్నది రూ.1500..ఎగ్గొట్టేది రూ. 12 వేలు

ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద రూ.1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయి. 5 గుంటలో పంట పండింది లేదు, వారు బతికింది లేదు. 5 గుంటలు ఉన్నందుకు 12 వేల రూపాయలు ఇవ్వం అని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. రైతు భరోసా కింద మీరు ఇస్తున్నది రూ.1500 అయితే ఎగ్గొట్టేది 12 వేల రూపాయలు.

రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24 లక్షల 57,000 మంది ఉన్నారు. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే రూ.12,000 నష్టపోతారు. కావున ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలని ఆయన సూచించారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 సంవత్సరాల వయసు దాటితే కార్డు కోల్పోతారు. కాబట్టి ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు.

గ్రామ సభల ద్వారానే ఎంపిక..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు ప్రకటించాలి. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్టు ప్రభుత్వం చెప్పింది. కానీ లబ్ధిదారుల ఎంపిక విధివిధానాలు విడుదల చేయలేదని విమర్శిం చారు. సిద్దిపేట జిల్లాలో 68 వేల దరఖాస్తులు వచ్చాయి. డోర్ టు డోర్ సర్వేలో మిగిలిన ఇళ్లను జిల్లా ఇంచార్జ్ మంత్రి ఫైనల్ చేస్తారు అని పత్రికల్లో వార్తలు వచ్చాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ సభలు పెట్టి అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసేది.

అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగాలంటే గ్రామసభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు మంజూరై అయిన వారు కొంత నిర్మించుకొని ఉన్నారు. ఇలాంటి ఇళ్లను పూర్తి చేసుకోడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. అందరూ పేదవారే కాబట్టి వెంటనే నిధులు విడుదల చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు.

## నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్..

# జాతికి అంకితం చేసిన మోదీ

మొదటిపేజీ తరువాయి

వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది" అని వివరించారు.

"సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.

ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.

ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు.

ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

## 'ఆతిశీ జింకలా పరుగెడుతున్నారు'.. మరోసారి నోరుజారిన బిధూడీ

దిల్లీ సీఎం ఆతిశీపై భాజపా సీనియర్ నేత, మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.

దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలో దిల్లీ సీఎం ఆతిశీపై భాజపా సీనియర్ నేత, మాజీ ఎంపీ రమేశ్ బిధూడీ తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. నాలుగేళ్లుగా దిల్లీ సమస్యలను పట్టించుకోని ఆతిశీ.. ఎన్నికలు సమీపించిన వేళ ఓట్ల కోసం నగర వ్యాప్తంగా జింకలా పరుగెడుతున్నారని అన్నారు.

"దిల్లీ ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నగర వీధుల పరిస్థితి చూడండి. గడిచిన నాలుగేళ్లలో ఆతిశీ ఎప్పుడూ ఈ సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ అడవిలో జింకలా దిల్లీ వీధుల్లో ఆమె తిరుగుతున్నారు" అని రమేశ్ బిధూడీ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆతిశీ ఇంటిపేరు మార్చుకుందని గతవారం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే.



మరోవైపు, రాజకీయ ప్రత్యర్థులపై వివాదాస్పద ప్రకటనలు చేయడం బిధూడీకి ఇదేం మొదటిసారి కాదు. బీఎస్పీ నేత డానిష్ అలీని దూషించడం మొదలు.. ప్రియాంకా గాంధీ వంటి నేతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వార్తలు కూడా వచ్చాయి. మరోవైపు భాజపా తరఫున దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బిధూడీ ఉండనున్నారనే ప్రచారం జరిగింది. అయితే, వీటిని తోసిపుచ్చిన ఆయన.. సీఎం అభ్యర్థి రేసులో తాను లేనని స్పష్టం చేశారు.

## నకిలీ టికెట్లతో తిరుమల శ్రీవారి దర్శనం.. పోలీసుల అదుపులో ఐదుగురు

మొదటిపేజీ తరువాయి

తిరుమల: నకిలీ ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 టికెట్లు) టికెట్లతో భక్తులకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కొందరు దళారులు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం నకిలీ టికెట్లతో భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. అనుమానం వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) విజిలెన్స్ అధికారులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కొందరు భక్తులను నిలిపివేశారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు.. ట్యాక్సీ డ్రైవర్ల ద్వారా నకిలీ టికెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

విచారణలో మరో ఐదుగురు నిందితులను అధికారులు గుర్తించారు. వారిలో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం కౌంటర్ ఉద్యోగి లక్ష్మీపతి, అగ్నిమాపక శాఖ సిబ్బంది మణికంఠ, భానుప్రకాశ్, ట్యాక్సీ డ్రైవర్లు శశి, జగదీశ్ ఉన్నారు. లక్ష్మీపతి విధుల్లో ఉన్నప్పుడు నకిలీ టికెట్లతో దర్శనానికి పంపుతున్నట్లు గుర్తించారు. మణికంఠ సాయంతో నకిలీ టికెట్లు తయారు చేస్తున్నారని.. ట్యాక్సీ డ్రైవర్లు శశి (తిరుపతి), జగదీశ్ (చెన్నై) ద్వారా భక్తులకు టికెట్లు విక్రయిస్తున్నట్లు తేల్చారు. హైదరాబాద్, ప్రొద్దుటూరు, బెంగళూరుకు చెందిన 11 మంది భక్తుల నుంచి రూ.19వేలు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం ఈ ఐదుగురు నిందితులను తితిదే విజిలెన్స్ అధికారులు, వన్ టౌన్ పోలీసులు విచారిస్తున్నారు.

## ప్రయాణ టికెట్లు, గిఫ్టులు, పండుగ ఆఫర్లు.. సైబర్ మోసాల పట్ల జరభద్రం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సంక్రాంతి పండుగ వేళ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖాగోయల్ సూచించారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ షాపింగ్ ఆఫర్లు, పండుగ డిస్కౌంట్లు, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా భారీ తగ్గింపు ధరలు చూపించి మోసం చేస్తారని తెలిపారు. గిఫ్ట్ కార్డు మోసాలు, ఫేక్ ఈ-వ్యాలెట్లు, చెల్లింపుల కోసం నకిలీ యాప్ లు, క్యూఆర్ కోడ్‌లు ఉపయోగిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా, వాట్సప్ మోసాలు పెరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణ టికెట్లు, గిఫ్టులు, షాపింగ్ వంటి పండుగ ఆఫర్లు అధికారిక ఫ్లాట్‌ఫామ్‌ల ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలన్నారు. సైబర్ క్రైం బాధితులు వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలని శిఖా గోయల్ వెల్లడించారు.

# తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ సుజయ్‌పాల్

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు.

1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా... 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

## మనోజ్‌ను అడ్డుకున్న పోలీసులు.. మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద మరోసారి ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

తిరుపతి: తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద బుధవారం సాయంత్రం మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. సినీనటుడు మంచు మనోజ్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. 'మా తాత, నాయనమ్మ సమాధులను చూసేందుకు ఎవరి అనుమతి కావాలి?" అంటూ మనోజ్ పోలీసులను ప్రశ్నించారు. కోర్టు ఆర్డర్ నేపథ్యంలో యూనివర్సిటీలోకి వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

మంత్రి నారా లోకేశ్‌తో మంచు మనోజ్ భేటీ

"తాత, నాయనమ్మ సమాధుల వద్దకు వెళ్లొద్దని కోర్టు ఆర్డర్‌లో లేదు. నేను చిన్నప్పటి నుంచి ఇక్కడికి వస్తున్నా. నన్ను ఎలా అడ్డుకుంటారు. గొడవ చేయాలనే ఉద్దేశం నాకు లేదు. అనవసరంగా ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. అనుమతిస్తే సమాధుల వద్దకు వెళ్లి దండం పెట్టుకుని వచ్చేస్తా" అని పోలీసు అధికారులను కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి చెబుతామని పోలీసులు సమాధానమిచ్చారు. పోలీసులు అనుమతించకపోవడంతో మనోజ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గేట్లు తియ్యండి అంటూ బిగ్గరగా కేకలు వేశారు. కాలేజీ ముందు ఉన్న దుకాణదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. అవ్వతాతల సమాధుల వద్దకు వెళ్లేందుకు వీలైతే జిల్లా ఎస్పీ దగ్గరకి వెళ్తానని మనోజ్ తెలిపారు.

పోలీసులతో చర్చల అనంతరం ఎట్టకేలకు మనోజ్ దంపతులు బందోబస్తు మధ్య తన తాత, నాయనమ్మ సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. ఈ క్రమంలో మనోజ్, విష్ణు బౌన్సర్ల మధ్య తోపులాట జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు పరిస్థితి అదుపుచేయడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.

## ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడు అరెస్ట్.. తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఆయుధాలు సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితుడిని అరెస్టు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హరేకృష్ణను అరెస్టు చేసిటన్లు సీపీ వెల్లడించారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను సీపీ మీడియాకు వెల్లడించారు. నిందితుడు హరేకృష్ణ హైదరాబాద్‌లో తుపాకులు

# ముద్దులొలికిన కోరుట్ల పోలీసు ముంగిలి
# ఫ్రెండ్లీ పోలీస్ ను మించి ఫ్యామిలీ పోలీస్

ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి..






జనవరి 14 న సంక్రాంతి పండగ పురస్కరించుకొని కోరుట్ల పోలీసులు వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి.సంక్రాంతి పండగ ఆచారం ప్రకారం కోరుట్ల పోలీసులు స్టేషన్ గేట్ ముందు రోడ్డుపైన,లోపల కార్యాలయం ముందు వేసిన రంగవల్లుల అలంకరణ ప్రజలను ఆశ్చర్యానికి,ఆనందానికి గురి చేసింది.పోలీస్ స్టేషన్ అంటేనే ఒక భయం,లోపల అడుగు పెట్టాలంటేనే ఒక సంశయం ఉంటుంది.అటువంటి వాతావరణాన్ని దూరం చేస్తూ స్టేషన్ ముందు వేసిన ముగ్గులు జనాన్ని మురిపించాయి.ముందుగా ఈ కొత్త పరిణామాన్ని గమనించిన ప్రముఖ న్యాయవాది శ్రీ బోయిని సత్యనారాయణ గారు తన సెల్ ఫోన్ కెమెరాలో ఫోటోలు తీసి తన వాట్సప్ స్టేటస్ లో పెట్టడం, కొన్ని గ్రూపుల్లోకి పంపడంతో ఇది ఒక వార్తగా సంచలనమయ్యింది.ఈ ముగ్గులు చూడడానికి కొందరు ప్రత్యేకించి వెళ్ళి చూశారు.పోలీస్ స్టేషన్ వైపు వెళ్లడం కూడా ఇష్టం లేని వాళ్లు కూడా ఈ రంగుల హరివిల్లులు పోలీస్ స్టేషన్ ముందు చూసి అబ్బురపడ్డారు.ఫిర్యాదులు, కేసులు,విచారణలు,అరెస్టులు మాత్రమే అనుకునేవారికి, పోలీసులకు మమతలు కూడా ఉంటాయని ప్రజలు కొత్తగా గమనించడం ఒక శుభ పరిణామం.పోలీసులు యూనిఫాం లో ఉండే పౌరులు అని కోరుట్ల ప్రజలు,విజ్ఞులు కామెంట్లు చేయడం ఒక కొత్త సంప్రదాయంగా అందరికీ అనిపించింది.పోలీస్ స్టేషన్ అంటే తుపాకులు, లాఠీలే కాదు ఆత్మీయ లోగిలి అని జనం భావించడం మంచి మార్పుకు సూచన.ఫ్రెండ్లీ పోలీస్ నుండి ఫ్యామిలీ పోలీస్ అనే ఆత్మీయ భావనను నెలకొల్పే ప్రయత్నం చేసిన ఎస్పై శ్రీ శ్రీకాంత్, సిఐ శ్రీ సురేష్ బాబు తో పాటు మొత్తం కోరుట్ల పోలీస్ సిబ్బంది ఈ నూతన ఆత్మీయ సృష్టికి స్థానిక ప్రజలు ఒక కొత్త సంబరానికి లోనయ్యారు. న్యాయవాదులు,డాక్టర్లు,ఉపాధ్యాయులు,మేధావులతో పాటు అన్ని పార్టీల నాయకులు ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ కోరుట్ల పోలీసులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.పోలీసుల ఈ పండగ వేడుకను వెలుగులోనికి తెచ్చిన అడ్వకేట్ శ్రీ బోయిని సత్యనారాయణ గారికి కరపత్రం అభినందనలు తెలియజేస్తున్నది

## పోలాండ్ సరిహద్దుల్లో రష్యా భీకర దాడి.. నాటో యుద్ధ విమానాలు రంగంలోకి..!



కరపత్రం న్యూస్ డెస్క్

నాటో దేశమైన పోలాండ్ సరిహద్దుల్లో రష్యా భారీ స్థాయిలో దాడులు చేసింది. ఉక్రెయిన్‌కు చెందిన కీలక భవనాలను ధ్వంసం చేసింది.

పోలాండ్ సరిహద్దుల్లో ఉక్రెయిన్‌పై రష్యా నేడు భీకర దాడి చేసింది. కీలకమైన గ్యాస్, ఎరువుల సరఫరా కేంద్రాలే లక్ష్యంగా చేసుకొని మాస్కోకు చెందిన ఏడు టీయూ-22, ఆరు టీయూ-95 స్ట్రాటజిక్ బాంబర్లు బాంబు దాడులు చేశాయి. పోలాండ్ సరిహద్దుకు అత్యంత సమీపంలో రష్యా క్షిపణులు పడ్డాయి. దీంతో నాటో దళాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే ఫైటర్ జెట్ విమానాలు గాల్లోకి ఎగిరాయి. నేలపై ఉన్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు అప్రమత్తమయ్యాయని నాటో ఆపరేషనల్ కమాండ్ హెడ్‌క్వార్టర్ నుంచి ప్రకటన వెలువడింది. ఉక్రెయిన్ ఎయిర్‌డిఫెన్స్ వ్యవస్థలు మొత్తం 40 క్షిపణుల్లో 30ని నేల కూల్చినట్లు అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. వీటికి అదనంగా మరో 70 అటాక్ డ్రోన్లు కూడా దాడి చేశాయన్నారు. నాటో సదస్సులో మిత్ర దేశాలు ఇచ్చిన హామీలు ఇంకా కొన్ని అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. ఎయిర్ డిఫెన్స్‌ల సరఫరాను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు ఉక్రెయిన్ నేషనల్ గ్రిడ్‌లో సమస్య కారణంగా ఆరు ప్రదేశాల్లో అత్యవసర కరెంటు కోతలు విధిస్తున్నారు.

నిన్న రష్యాపై ఉక్రెయిన్ చేసిన దాడికి ప్రతీకారంగానే ఈ దాడి చోటు చేసుకొన్నట్లు రక్షణ నిపుణులు అంచనావేస్తున్నారు. ముఖ్యంగా బ్రిటన్ తయారీ స్ట్రామ్ షాడో, అమెరికా తయారీ ఏటీఏసీఎంఎస్‌లను కీవ్ వాడుతుండటంతో మాస్కో దళాలు ఇబ్బంది పడుతున్నాయి. మంగళవారం దాదాపు 14 క్షిపణులు, 200 డ్రోన్లతో రష్యాపై విరుచుకుపడింది. కెమికల్ ఫ్యాక్టరీలు, విద్యుత్తు కేంద్రాలను లక్ష్యంగా చేసుకొన్నాయి. తాము 2 మిలియన్‌డాలర్ల విలువైన స్ట్రామ్ షాడో క్షిపణులను కూల్చేసినట్లు రష్యా ప్రకటించింది.

## డొనాల్డ్ ట్రంప్‌నకు కోకా కోలా సర్‌ప్రైజ్ గిఫ్ట్..!

కరపత్రం న్యూస్ డెస్క్

కోక్ ప్రియుడైన అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ సంస్థ ఓ గిఫ్ట్ ఇచ్చింది. అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శీతలపానీయం కోకా కోలా ప్రియుడు. ఆయన రోజుకు 12 డైట్ కోక్‌లను అలవోకగా తాగేసేవారట. ఈవిషయాన్ని గతంలో న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. రెండోసారి ఆయన అమెరికా పగ్గాలను స్వీకరించనున్న వేళ కోకా కోలా ఓ సర్‌ప్రైజ్ గిఫ్ట్‌ను ఇచ్చింది. ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఓ డైట్ కోక్ బాటిల్‌ను డిజైన్ చేసింది. ఆ కంపెనీ ఛైర్మన్, సీఈవో జేమ్స్ క్విన్సీ స్వయంగా దానిని తీసుకెళ్లి ట్రంప్‌నకు అందజేశారు. ఈవిషయాన్ని ట్రంప్ కమ్యూనికేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ మార్గో మార్టిన్ ఎక్స్‌లో షేర్ చేశారు. ఈ బాటిల్ గ్రే, బ్లూ, రెడ్ లేబుల్‌పై ‘అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ జే ట్రంప్ ప్రమాణస్వీకారం’ అని రాసి ఉంది. 20 జనవరి 2025 అని తేదీ వేసి ఉంది. దీనిని ట్రంప్ గౌరవార్థం ఎరుపు రంగు బాక్స్‌లో పెట్టి ఇచ్చారు. దీంతోపాటు కోకా కోలా కంపెనీ 55 బిలియన్ డాలర్ల విలువైన ఆర్థిక కార్యకలాపాల్లో భాగమైందని, అమెరికాలో 8,60,000 ఉద్యోగాలను కల్పించిందన్న సమాచారం ఉన్న కార్డు ఉంది. “అధ్యక్ష ప్రమాణస్వీకార గౌరవార్థం ప్రత్యేకమైన బాటిల్ విడుదల చేసే దశాబ్దాల నాటి మా సంప్రదాయం కొనసాగుతోంది” అని పేర్కొన్నారు. గతంలో బరాక్ ఒబామా ప్రమాణస్వీకారం సందర్భంగా కూడా ప్రత్యేకమైన సీసాలను సిద్ధం చేసింది. ఆ తర్వాత అవి ఈబేలో ఒక్కోటి అత్యధికంగా 50 డాలర్ల వరకు ధర పలికింది.డొనాల్డ్ ట్రంప్‌నకు డైట్ కోక్ తాగే అలవాటు చాలాకాలం నుంచి ఉంది. తాను అధ్యక్షుడిగా 2016లో బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్వేతసౌధంలో ప్రత్యేక బటన్ ఏర్పాటుచేశారు. ఆయనకు అవసరమైనప్పుడు దానిని నొక్కితే డైట్ కోక్ తెచ్చి ఇచ్చేవారు. ‘నేను దానిని నొక్కిన ప్రతిసారీ అందరూ కొంచెం భయపడతారు’ అని జోక్ చేశారు. వాస్తవానికి ట్రంప్ మంచినీళ్లు తాగడం ఎప్పుడూ చూడలేదని యూఎఫ్‌సీ సీఈవో డానా వైట్ ఓ సందర్భంలో వెల్లడించారు. ఇటీవల కాలంలో ట్రంప్ రెగ్యులర్ కోక్ కూడా తాగుతున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.

# సాయుధ ఘర్షణలు.. ప్రకృతి ప్రకోపాలు..
# ప్రపంచానికి ‘పంచ’ ముప్పులివే..!

కరపత్రం న్యూస్ డెస్క్





ఈ ఏడాదికి సంబంధించి దేశాల మధ్య సాయుధ ఘర్షణలే ప్రపంచానికి అతిపెద్ద ముప్పుగా ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. ఒకవైపు ఉక్రెయిన్- రష్యాల మధ్య యుద్ధం ఎంతకూ తెగడం లేదు. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఆయా దేశాల మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నడుమ.. 2025కు సంబంధించి దేశాల మధ్య సాయుధ ఘర్షణలే ప్రపంచానికి అతిపెద్ద ముప్పు అని ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశాల సందర్భంగా తన వార్షిక ‘అంతర్జాతీయ నష్ట ప్రమాద నివేదిక’ను విడుదల చేసింది. 900 మంది నిపుణులు, విధానకర్తలు, పరిశ్రమాధిపతులను సర్వే చేసి దీన్ని రూపొందించింది. మొత్తం మీద వాతావరణ సంక్షోభాలను తక్షణ, స్వల్ప, దీర్ఘకాలిక ముప్పుగా పరిగణించింది.

దేశాల మధ్య సాయుధ ఘర్షణలు, విపత్కర వాతావరణ పరిస్థితులు, భౌగోళిక-వాణిజ్య వివాదాలు, తప్పుడు సమాచార వ్యాప్తి, సామాజిక విభజనలను ఈ ఏడాదికి సంబంధించి మొదటి ఐదు తీవ్ర ముప్పులుగా పేర్కొంది. వచ్చే రెండేళ్లలో తప్పుడు సమాచార వ్యాప్తిని అతిపెద్ద ముప్పుగా తేల్చింది. దీంతోపాటు ప్రకృతి ప్రకోపాలు, దేశాల సాయుధ ఘర్షణలు, సామాజిక విభజనలు, సైబర్ గూఢచర్యాలను స్వల్పకాలిక ముప్పులుగా వర్గీకరించింది.

పోలాండ్ సరిహద్దుల్లో రష్యా భీకర దాడి.. నాటో యుద్ధ విమానాలు రంగంలోకి..!

వచ్చే పదేళ్లలో వాతావరణ వైపరీత్యాలను తీవ్ర ముప్పుగా పరిగణించింది. జీవవైవిధ్య నష్టం-పర్యావరణ వ్యవస్థ పతనం, భూమి ఆవరణ వ్యవస్థల్లో మార్పులు, ప్రకృతి వనరుల కొరత, తప్పుడు సమాచార వ్యాప్తిని దీర్ఘకాలిక ముప్పులుగా పేర్కొంది.

భారత్ వంటి దేశాలు ప్రత్యామ్నాయ శక్తులుగా..

రాబోయే దశాబ్ద కాలంలో ప్రపంచ రాజకీయాల దృక్పథం విషయానికొస్తే.. చాలా మంది నేతలు బహుళ ధ్రువ, వికేంద్రీకరణ పరిస్థితులను ఆశిస్తున్నట్లు నివేదిక తెలిపింది. పాశ్చాత్య దేశాల ఆధిపత్యంలో క్షీణత కొనసాగుతుందని.. చైనా, భారత్, గల్ఫ్ దేశాల రూపంలో ప్రత్యామ్నాయ శక్తులు బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, దేశాల మధ్య విశ్వాసం సన్నగిల్లడం, వాతావరణ సంక్షోభాల వంటివి ప్రపంచానికి సవాళ్లుగా మారాయని డబ్ల్యూఈఎఫ్ ఎండీ మిరెక్ డుసెక్ తెలిపారు. పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడమా? లేదా సంక్లిష్టతలను ఎదుర్కోవడమా? అనేది నేతల చేతుల్లోనే ఉందన్నారు.

# భారత్, యూఎస్ ప్రయోజనాలను
# దెబ్బతీసే కుట్ర.. కేంద్రానికి నివేదిక

కరపత్రం న్యూస్ డెస్క్



భారత్, అమెరికా భద్రతా ప్రయోజనాలను దెబ్బతీసే దురుద్దేశంతో కొన్ని శక్తులు పని చేస్తున్న విషయాన్ని అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ గుర్తించింది. దర్యాప్తులో తెలిసిన అంశాలతో రూపొందించిన తుది నివేదికను తాజాగా భారత ప్రభుత్వానికి అందజేసింది. 2023 నవంబరులో ఏర్పాటైన ఈ కమిటీ విచారణకు అవసరమైన కీలక సమాచారాన్ని అమెరికా అధికారులు భారత్‌తో పంచుకున్నారు. కొన్ని వ్యవస్థీకృత నేర బృందాలు, ఉగ్రవాద సంస్థలు, మాదక ద్రవ్యాల ముఠాలు తదితరులు చేస్తున్న కార్యకలాపాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకున్నారు.

ఈ సమాచారం ఆధారంగా భారత్‌లో ఏర్పాటైన విచారణ కమిటీ స్వతంత్రంగా దర్యాప్తు చేపట్టింది. యూఎస్ అధికారులు ఇచ్చిన లీడ్‌లు తీసుకొని కూపీ లాగింది. భారత్‌లోని పలు విచారణ సంస్థల్లో పని చేస్తున్న అధికారుల నుంచి కూడా విచారణ కమిటీ కీలక సమాచారం రాబట్టింది. పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను నిశితంగా పరిశీలించింది. ఈ క్రమంలో యూఎస్ అధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించారు. భారత్, అమెరికా అధికారులు పలు మార్లు ఇరు దేశాల్లో పర్యటించి తెలిసిన సమాచారాన్ని పంచుకున్నారు.

నౌకాదళంలోకి ఐఎన్‌ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్.. జాతికి అంకితం చేసిన మోదీ

సుదీర్ఘ విచారణ అనంతరం అత్యున్నత స్థాయి అధికారుల విచారణ కమిటీ తమ నివేదికను భారత ప్రభుత్వానికి అందజేసింది. దేశ ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర పన్నిన ఓ వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. విచారణ చేపడుతున్న క్రమంలో ఆ వ్యక్తి నేర సంబంధాలు, పూర్వాపరాలు బయటపడ్డాయని వెల్లడించింది. కావున వీలైనంత త్వరగా చట్టపరమైన చర్యలను తీసుకోవాలని కోరింది. ఇలాంటి నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని చెప్పింది. ప్రభుత్వ పరంగా కొన్ని విధానాలను మెరుగు పరచుకోవాల్సి ఉందని విచారణ కమిటీ సిఫారసు చేసింది. కొన్ని మార్పులు చేస్తే ఇలాంటి నేరాలపై భారత ప్రతిస్పందన సామర్థ్యం బలోపేతమవుతుందని వ్యాఖ్యానించింది.

## కౌశిక్ రెడ్డి అక్రమ అరెస్ట్
## రిమాండ్ రిపోర్ట్ ను తిరస్కరించిన కోర్టు

కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధ



కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో దురుసుగా ప్రవర్తించారని కౌశిక్‌రెడ్డిపై పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఈక్రమంలో సోమవారం,జనవరి 13 రాత్రి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో కౌశిక్ రెడ్డి ని అరెస్ట్ చేసిన పోలీసులు కరీంనగర్‌కు తరలించారని,సిద్దిపేట రూరల్ బిఆర్ఎస్వి సోషల్ మీడియా కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నదని అన్నారు.ఐతే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరైందని, మూడు కేసుల్లో న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారని,దీనితో ఇవి అక్రమ కేసులని తేలిపోయిందని రాజశేఖర్ అన్నారు.కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ తో జరిగిన సంవాదంలో, వాస్తవాన్ని మాట్లాడిన పాడి కౌశిక్ రెడ్డి, అతని పార్టీ ఫిరాయింపులను ప్రశ్నిస్తే ప్రభుత్వం అరెస్టు చేస్తారా అని నిలదీశారు.రాజ్యాంగ విలువలకు, ప్రజాస్వామిక స్ఫూర్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు 6 ఉచిత గ్యారంటీలు ఇచ్చిన కాంగ్రెస్,ఏడో గ్యారెంటీగా ప్రజాస్వామ్యం కాపాడుతామంటూ ఊదరగొట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని కరపత్రం తో అన్నారు.ఇలాంటి అక్రమ నిర్బంధాలకు భయపడే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ కార్యకర్తలను, నాయకులను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని నిలదీస్తూనే ఉంటామని అన్నారు.ప్రజా పక్షంగా బి ఆర్ ఎస్ పోరాడుతూనే ఉంటుందని, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక, ప్రజాస్వామిక వ్యతిరేక విధానాలను నిలదీస్తూ నే ఉంటామని రాజశేఖర్ తెలియజేసారు.బి ఆర్ ఎస్ కు పోరాటాలు కొత్తకాదు. పోరాటాలతోనే జన్మించిన పార్టీ తమదని అన్నారు.

# హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కాదు మరో పేరు పాడు కౌశిక్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 15**

హుజురాబాద్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పాడి.. కాదు కాదు పాడు కౌశిక్ రెడ్డి.. అని తనుగుల మాజీ ఎంపీటీసీ వాసాల రామస్వామి,. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కౌశిక్ రెడ్డి చేస్తున్న చర్యలను చూస్తే హుజురాబాద్ కాన్స్టెన్సీ లో ఉన్న ప్రజలు మేము తలదించుకునే పరిస్థితి వస్తుంది అన్నారు. ఇవాళ ఈ పాడు కౌశిక్ రెడ్డి అనే వ్యక్తి హుజురాబాద్ ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు దళిత బంధు ప్రవేశపెట్టినప్పుడు అందులో నేను కూడా వన్ అఫ్ ది డైరెక్టర్ ను ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి నేను కలెక్టర్ తో అందరం కూర్చొని దళిత బంధు ను పైలట్ ప్రాజెక్టు కింద దళితులకు అందించడం జరిగింది అన్నారు. మొన్న వచ్చినటువంటి ఎలక్షన్లో కౌశిక్ రెడ్డికి ఓట్లు పడతయో పడేయో అని ఏకైక ఉద్దేశం కొద్దీ అప్పుడు ఎస్సీ కార్పొరేషన్ ఈడీని సెలవులలో పంపించి ఈ దళిత బందును సెకండ్ విడత ఆపించింది నువ్వు కాదా కౌశిక్ రెడ్డి అని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర సాధనలో నీ పాత్ర టిఆర్ఎస్ ఎదుగుదలలో, రాష్ట్ర అభివృద్ధిలో నీ పాత్ర ఏంటి కౌశిక్ రెడ్డి, అని మండిపడ్డారు. ఈ దళిత బందు పైలెట్ ప్రాజెక్టు అనేది ఈటల రాజీనామా వల్ల మాత్రమే వచ్చింది అని ఈ హుజురాబాద్ దళిత ప్రజలకు దళిత బంధు అనే పథకం వచ్చింది అన్నారు. ఈ దళిత



బంధు పథకాన్ని అప్పుడున్నటువంటి గవర్నమెంట్ ఎలాంటి షరతులు లేకుండా ఇంప్లిమెంట్ చేస్తుంటే ఈ కౌశిక్ రెడ్డి తన స్వార్థం కోసం ఈ దళిత బందును ఆపుదల చేయించి, అప్పుడున్నటువంటి ఎన్నికలలో నేను చచ్చిపోతా ఆ చంటి బిడ్డను అతని భార్యను చంపుతా అని బ్లాక్మెయిల్ చేసి, ఓట్లు వేయించుకుంది నువ్వు కాదా కౌశిక్ రెడ్డి అని పేర్కొన్నారు. కానీ నువ్వు చేస్తున్నది ఏంటి కౌశిక్ రెడ్డి.. హుజురాబాద్ ప్రాంతాన్ని అల్లకల్లోలం చేస్తున్నావ్ అని మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ముగ్గురు మంత్రులు ముగ్గురు కలెక్టర్ల ఆధ్వర్యంలో అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరుగుతుంటే అందులో నీ ప్రజలకు నీ ప్రాంతానికి నియోజకవర్గానికి ఏమి కావాలో అడగకుండా జిల్లా కేంద్రం నడి ఒడ్డున హుజురాబాద్ పరువు తీసి, హుజురాబాద్ అస్తిత్వాన్ని పై దెబ్బ కొడుతున్నావ్.. అన్నారు.ఆ రోజున తెలంగాణ ఉద్యమకారులను ప్రజలను కొట్టిన చరిత్ర నీది కాదా, అని వివరించారు.

దళితుల మీద ప్రేమే ఉంటే, నువ్వు కూడా రాజీనామా చెయ్, రెండో విడత దళిత బంధు వస్తుంది, అని వివరించారు. ఒకవేళ రాకపోతే కాంగ్రెస్ కార్యకర్తలుగా ముఖ్యమంత్రి ఇంటిముందు ధర్నా చేస్తామని, దళిత బంధు వచ్చేదాకా పోరాడుతామని, వివరించారు. ఈరోజు నా హుజురాబాద్ లో చిన్న పిల్లవాడు కూడా నిన్ను చూస్తే, నవ్వుకునే పరిస్థితి వచ్చింది కౌశిక్ రెడ్డి అని అన్నారు. పిచ్చి లేసినట్టుగా, ఆగమాగం చేస్తున్నావు అని మండిపడ్డారు. దళిత ప్రజలారా,దళిత సోదరులారా, ఆలోచించండి, ప్రజల మీద ప్రేమ లేని కౌశిక్ రెడ్డి తో, తిరగకండి, ప్రజల మీద నిజమైన ప్రేమే ఉంటే, ఈటెల రాజేందర్ రాజీనామా చేస్తే వచ్చిన అభివృద్ధి నిధులు, మన దళిత బంధు, మళ్లీ కౌశిక్ రెడ్డి రాజీనామా తో సెకండ్ విడత దళిత బంధు, నియోజకవర్గ అభివృద్ధి కి చాలా నిధులు వస్తాయి, ఆలోచన చేయండి అని తెలిపారు. కౌశిక్ రెడ్డి దళితుల పట్ల హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల పట్ల హుజురాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామనే ఉద్దేశమే గనుక నీకు ఉంటే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో.. వాసాల రామస్వామి తో పాటు కాంగ్రెస్ నాయకులు చిలివేరి రాజమౌళి, మేక మల్ల వెంకటేష్, రాచపల్లి సాగర్, రాచపల్లి గణేష్, కుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.,

# రామగిరి మండలంలో ఘనంగా సంక్రాంతి కనుమ వేడుకలు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 15.**






రామగిరి మండలంలో మంగళ, బుధ వారాలలో ఘనంగా సంక్రాంతి, కనుమ వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాలలో దేవాలయాలలో పూజలు నిర్వహించారు. మహిళలు ఇండ్లలో వ్రతాలు నిర్వహించారు. కనుమ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఒకరింటికి ఒకరు వెళ్లి కుంకుమ బొట్టు పెట్టుకుంటూ, నోముకున్న వస్తువులను అందించి, కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. బంధువులు, చుట్టాలతో ప్రతి ఇంటింటా సంబరాలు ఘనంగా జరిగాయి. మరియు మహిళలు ఉదయాన్నే లేచి ఇంటిముందు రంగురంగుల ముగ్గుల తో సుందరంగా అలంకరించుకొని , పిల్లలు పెద్దలు గాలిపటాలను ఎగరవేసి ఈ పండుగను చాలా గొప్పగా జరుపుకున్నారు.

# పొలిటికల్ జట్టు విజయం



**కరపత్రం రామగిరి ప్రతినిధి, జనవరి 15.**

దివంగత శ్రీపాదస్మారక క్రికెట్ టోర్నమెంట్లో మంగళవారం రాజకీయ జట్టు మీడియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్లో పొలిటికల్ జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మీడియా జట్టు నిర్ణీత 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 107 పరుగుల సాధించింది. అనంతరం 108 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బర్ల శ్రీనివాస్ సారథ్యంలోని పొలిటికల్ జట్టు ఓపెనర్ మాజీ ఎంపిటిసి కొట్టే సందీప్ తొలి బంతి నుండే బౌలర్లపై విరుచుకుపడుతూ పరుగుల వరద పారించాడు. ఈ క్రమంలో అర్ధ సెంచరీ చేసిన సందీప్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ మైదానం నలుమూలల భారీ షాట్లు కొడుతూ ప్రేక్షకులను అలరించాడు. వికెట్ నష్టపోకుండా రాజకీయ జట్టు లక్ష్యాన్ని సాధించింది. ఒంటి చేత్తో జట్టును గెలిపించిన సందీప్ కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వనమా రామచంద్రరావు మేన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేశారు.

# ఘనంగా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు...

**- డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి సేవలు మరువలేనివి...**

**- తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్వి అర్జున్..**

**కరపత్రం ప్రతినిధి, హుజురాబాద్/ వీణవంక, జనవరి 15.**



హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి లాప్రోస్కోపీ సర్జన్, జమ్మికుంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పారుపెల్లి శ్రీకాంత్ రెడ్డి సేవలు పేద ప్రజలు ఎన్నటికి మరువలేనివని తెలంగాణ యూత్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్వి అర్జున్ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఎస్ఆర్ ఆస్పత్రిలో శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చేత కేక కట్ చేసి కేకు తినిపించి, ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మారుమూల గ్రామం నుంచి పేద కుటుంబం నుండి వైద్యుడిగా ఎదిగి, ఎంతోమందికి నిస్వార్థంగా సేవలందిస్తూ.. పేద ప్రజల ప్రాణాలు రక్షిస్తున్న గొప్ప వైద్యుడు అన్నారు. ఎంతోమందికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని తక్షణమే స్పందించి సరైన సమయంలో సరైన వైద్యం అందించి ప్రాణాలు రక్షించిన పేదల వైద్యుడు శ్రీకాంత్ రెడ్డి అని కొనియాడారు. అలాంటి వైద్యుడు శ్రీకాంత్ రెడ్డి నిండా నూరేళ్లు జీవించి పేద ప్రజలకు మరెన్నో సేవలందించాలని ఆకాంక్షించారు.

# ఆర్.జి-3, అడ్రియాల ఏరియాలలో పర్యటించిన స్టాండింగ్ కౌన్సిల్ శ్రీహర్షరెడ్డి

**కరపత్రంజ రామగిరి ప్రతినిధి జనవరి 15**



సింగరేణి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ శ్రీహర్షరెడ్డి బుధవారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పర్యటించారు. జి.యం. కార్యాలయానికి విచ్చేసిన వారిని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు సన్మానించారు. ఈ సందర్భంగా రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలకు సంబంధించిన పెండింగ్ కోర్టు కేసులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అడ్రియాల లాంగ్ వాల్ గనిని సందర్శించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ కొలిపాక నాగేశ్వరరావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.రామ్మోహన్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డిప్యూటీ ఎస్టేట్స్ మేనేజర్ కె.ఐలయ్య, డిపిఎం గుర్రం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు...

**- నేడు ఉదయం అగ్ని గుండాలు స్వామివారి కళ్యాణం...**

**- ఆలయ పూజారి గంగాధర్ స్వామి...**

**కరపత్రం శంకరపట్నం జనవరి 15**

అంగరంగ వైభవంగా కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమై నమ్మిన భక్తుని ఇంట్లో నిలిచే శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల పండుగ వలె ఆశేష భక్తజనం నడుమ నిర్వహించడం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు గొల్యాల గంగాధర్ స్వామి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర స్వామి మాట్లాడారు. భక్తిశ్రద్ధలతో కోరిన కోర్కెలు తీర్చికొంగు బంగారమయ్యే భక్తుని ఇంటిలో నిలువైన కొంగుబంగారం మైన శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి దేవాలయం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకర పట్నం మండలం, మొలంగూర్ గ్రామంలో కాకతీయుల, నైజాం కాలం కొలువైదీరిన శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి కి ప్రతిఏటా అత్యంత భక్తిశ్రద్ధలతో ఆశేష భక్తజనం



నడుమ బ్రహ్మోత్సవాలను నిర్వహించడం జరుగుతుందని 20 25 సంవత్సరము సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామికి గ్రామంలో ఆశేష భక్తజన నడుమ భారీ ఊరేగింపు అనంతరం ఆలయ ఆలయ ప్రవేశం ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండాల నిర్వహణ కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి గురువారం వేకువ జామున అగ్ని దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల అగ్ని గుండాల ప్రవేశం కార్యక్రమం అనంతరం స్వామివారి కళ్యాణం తీర్థ ప్రసాద వితరణ అన్నదాన వితరణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఈ బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర కర్ణాటక ఇతర రాష్ట్రాల నుండి, అధిక సంఖ్యలో భక్తులు హాజరై వారి మొక్కలన చెల్లించుకొని, స్వామివారి కృపకు పాత్రులైన బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా, ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు భక్తులు అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలను ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శ్రీ భద్రకాళి వీరభద్ర స్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వము, జిల్లాకు చెందిన రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ప్రత్యేక చొరవ తీసుకొని ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని గ్రామస్తులు, భక్తులు కోరుచున్నారు.

# ఘనంగా మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి జన్మదిన వేడుకలు...

**- రైతు పక్షపాతి.. పేదల పెన్నిధి.. ప్రజానేత కు ఘన నివాళులు...**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 15.**

దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ తుమ్మేటి సమ్మి రెడ్డి 60వ జయంతి ని పురస్కరించుకొని, మంగళవారం వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో తుమ్మేటి సమ్మిరెడ్డి చిత్రపటానికి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.జమ్మికుంట మార్కెట్ చెర్మన్ గా,పిసిసి మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షులు గా కాంగ్రెస్ పార్టీకి, హుజూరాబాద్ ప్రాంత రైతాంగానికి కార్మికులకు,కర్షకులకు, చేసిన సేవలను కొనియాడారు.వారు ఉమ్మడి రాష్ట్రంలో



ముఖ్యమంత్రులు దివంగిత నేతలు వైఎస్ రాజశేఖరరెడ్డి ,రోశయ్య,మరియు కిరణ్ కుమార్ రెడ్డి తో, ప్రస్తుత ముఖ్యమత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అద్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో వారికి వున్న అనుబంధాన్ని స్మరించు కున్నారు. వారులేని లోటు తీర్చలేనిది అని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు కామిడీ శ్రీపతి రెడ్డి, ఒరెం సునీల్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల కొండాల్ రెడ్డి,మాజీ సర్పంచ్లు చిన్నాల ఐలయ్య,అల్లువెల్లి కోమాల్ రెడ్డి, పర్లపెల్లి రమేష్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి రాకేష్ రెడ్డి యువసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సతీశ్,సీనియర్ నాయకులు పత్తి సమ్మిరెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, మిరాల సమ్మిరెడ్డి,ఎడేల్లి సురేందర్ రెడ్డి, యువజన నాయకులు కిట్టు,నల్లగోనీ శ్రీనివాస్,కర్ర రాంగోపాల్ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, శ్రీకాంత్,రాజన్న, సంది సురేందర్ రెడ్డి,వావినీల సత్యనారాయణ, పల్లేర్ల కిరణ్,తోట తిరుపతి, పార్టీ నాయకులు తుమ్మెటి ఆత్మీయులు తదితరులు పాల్గొన్నారు.

# వీరభద్ర స్వామి దేవాలయానికి ఫ్యాన్ల బహుకరణ...

**- సీనియర్ జర్నలిస్టు కుటుంబాన్ని అభినందించిన తాజా మాజీ సర్పంచ్, గ్రామస్తులు**

**కరపత్రం శంకర పట్నం జనవరి 15**

కోరిన కోరికలు తీర్చి, కొంగు కొంగుబంగారమయ్యే శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి దేవాలయానికి భక్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన భక్తుడు కుటుంబ సభ్యులు ఫ్యాన్లను బహుకరించినట్లు గ్రామ తాజా మాజీ సర్పంచ్ మోరె అనూష శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అనూష శ్రీనివాస్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం,



మొలంగూర్ గ్రామంలోని కాకతీయుల నైజాం కాలం నాటి దేవాలయం భక్తుల కోరిన కోర్కెలు తీర్చి కొంగు బంగారమయ్యే శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర స్వామి దేవాలయానికి భక్తుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, తాజా మాజీ వార్డు సభ్యురాలు దండు స్వరూప సమ్మయ్య, వారి కుమార్తె అల్లుడు వెజ్జ కీర్తి కిరణ్ దేవాలయానికి ఫ్యాన్లను బహుకరణ చేసినందుకు గ్రామస్తుల భక్తుల పక్షాన వారి కుటుంబ సభ్యులను అభ్యర్థిస్తున్నట్లు అనుష శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్లూరి వీరేశం, సభ్యులు భక్తులు, తాజా మాజీ వార్డు సభ్యులు గాజుల మహేష్, గాజుల సంపత్, చిరుత ప్రవీణ్, రేండ్ల సాంబశివారెడ్డి, తుమ్మ రఘుపతి, అన్నం బుచ్చిరెడ్డి, చీకట్ల సతీష్, నల్ల తిరుపతిరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.